
ప్రథమ అధ్యక్షత్వపు సందేశము, ఏప్రిల్ 2018



అధ్యక్షుడు రస్సెల్ ఎమ్. నెల్సన్ గారిచే

# మనము కలిసి ముందుకు సాగిపోవుచుండగా

సంపాదకుని గమనిక: యేసు క్రీస్తు యొక్క కడవరి దిన పరిశుద్ధుల సంఘమునకు 17వ అధ్యక్షునిగా జనవరి 14, 2018న నియమించబడిన అధ్యక్షుడు రస్సెల్ ఎమ్. నెల్సన్, జనవరి 16, 2018 న సాల్ట్‌లేక్ దేవాలయము యొక్క అనుబంధ గృహము నుండి ప్రత్యక్ష ప్రసారములో ఈ సూచనలను అందించారు. ఈ సంచికలో ఆయన మాటలు ప్రచురించబడాలని ఆయన మనవి చేసారు.

ప్రియమైన సోదర సోదరీలారా, ఈ ఉదయమున సవినయముగా మీ ముందున్నాను. నాలుగు దినముల క్రిందట ఒక మహోన్నత వ్యక్తి, దేవుని ప్రవక్త —అధ్యక్షుడు థామస్ ఎస్. మాన్సన్ గారిని విశ్రాంతిలోనికి మేము పరుండబెట్టి యున్నాము. మహోన్నతమైన, మహత్తరమైన ఆయన జీవితాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. ఆయన నాకు నేర్పిన దాని కొరకు కృతజ్ఞతా పూర్వకంగా నేను మా స్నేహాన్ని చిరకాలం జ్ఞాపకముంచుకుంటాను. మన ప్రభువైన యేసు క్రీస్తు నందు పరిపూర్ణ విశ్వాసంతో ఆయన స్వంతమైన ఈ సంఘపు భవిష్యత్తు కొరకు ఇప్పుడు మనము ఎదురుచూడవలెను.

రెండు రోజుల క్రితం జీవిస్తున్న అపోస్తులులందరూ సాల్ట్ లేక్ దేవాలయపు మేడ గదిలో సమావేశమయ్యారు. అక్కడ వారు మొదట ప్రథమ అధ్యక్షత్వాన్ని పునర్వ్యవస్థీకరించుటకును, రెండవదిగా నేను ఈ సంఘమునకు అధ్యక్షునిగా సేవ చేయవలెననియు, ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ యుగంలో ప్రవక్త జోసెఫ్ స్మిత్ ద్వారా పునరుద్ధరింపబడిన యాజకత్వపు తాళపు చెవులన్నిటినీ పొందిన సహోదరులు నా శిరస్సుపై చేతులుంచి సంఘ అధ్యక్షునిగా నన్ను అభిషేకించి నియమించుటకు  నా సహోదరులను కలిగియుండుట ఎటువంటి అనుభూతియో మీకు చెప్పుటకు మాటలు సరిపోవు. అది ఒక పరిశుద్ధమైన, వినయపూర్వకమైన అనుభవము.

తరువాత దేవుడు నాకు సలహాదారులుగా ఎవరిని సిద్ధపరిచారో వివేచించడం నా బాధ్యత అయ్యింది. నేను ఎంతో ప్రియముగా ప్రేమించే పన్నెండు మంది శిష్యులలో

ప్రథమ అధ్యక్షత్వపు నెలవారీ సందేశము నిలుపు చేయబడును

ఈ సందేశము నెలవారీగా ప్రచురింపబడుచున్న ప్రథమ అధ్యక్షత్వపు ఆఖరి సందేశము. భవిష్యత్తులో, ప్రథమ అధ్యక్షత్వము ముఖ్యమైన సందేశములను అవసరమును బట్టి సంఘము యొక్క వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా మరియు సంఘ పత్రికల ద్వారా పంచుకొనును.

కేవలం ఇద్దరిని మాత్రమే నేను ఎలా ఎంపిక చేయగలను? నా తీక్షణమైన ప్రార్థనలకు జవాబిచ్చిన ఆ ప్రభువుకు నేను ఎంతో కృతజ్ఞుడను. అధ్యక్షుడు డాల్లిన్ హార్రిస్ ఓక్స్ మరియు అధ్యక్షుడు హెన్రీ బెన్నియన్ ఐరింగ్ వరుసగా మొదటి మరియు రెండవ సలహాదారులుగా నాతో కలిసి సేవ చేయుటకు అనుకూలంగా ఉన్నందుకు నేనెంతో కృతజ్ఞుడను. అధ్యక్షుడు డీటర్ ఎఫ్. ఉక్‌డార్ఫ్ పన్నెండుమంది అపోస్తలులలోతన స్థానమునకు చేరుకున్నారు. సాటిలేని ఆయన ప్రజ్ఞకు తగిన పెద్ద బాధ్యతలు ఇప్పటికే ఆయన స్వీకరించియున్నారు.

అధ్యక్షుడు మాన్సన్ గారి సలహాదారులుగా ఆయన మరియు అధ్యక్షుడు ఐరింగ్ అందించిన మహత్తర సేవలకు నేను నివాళులర్పిస్తున్నాను. వారు పూర్తిగా సమర్థులు, అంకిత భావం కలిగి, ప్రేరేపించబడిన వ్యక్తులు. వారికి మా ఎనలేని కృతజ్ఞతలు. ఎక్కడైతే వారి సేవలు అవసరమో అక్కడ సేవచేయుటకు వారిలో ప్రతి ఒక్కరూ సంసిద్ధముగానున్నారు.

వయస్సు, అనుభవాల ఆధిక్యతను బట్టి ద్వితీయ స్థానంలోనున్న అధ్యక్షుడు ఓక్స్, పన్నెండు మంది అపోస్తులుల సమూహమునకు కూడా అధ్యక్షత వహిస్తారు. ఐతే, ప్రథమ అధ్యక్షత్వానికి పిలువబడినందున, సంఘ నియమావళికి అనుగుణంగా, ఆధిక్యతలో తరువాతి స్థానంలో ఉన్న అధ్యక్షుడు ఎం. రస్సెల్ బల్లార్డ్, ఆ సమూహమునకు తాత్కాలిక అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ప్రథమ అధ్యక్షత్వము, ఈ పన్నెండు మందితో చేదోడువాదోడుగా పనిచేయుచు ఆ ప్రభువు చిత్తమును గ్రహించి, ఆయన పరిశుద్ధ కార్యములను ముందుకు నడిపించెదరు.

మీ ప్రార్థనలకు మేమెంతో కృతజ్ఞులము. ప్రపంచవ్యాప్తముగా మా కొరకు ప్రార్థనలు చేయబడుచున్నవి. అధ్యక్షుడు మాన్సన్ చనిపోయిన మరుసటి ఉదయం అటువంటి ప్రార్థనే బెన్సన్ అనే నాలుగేండ్ల బాలుడు చేశాడు. ఆ బాలుని తల్లి నా భార్యకు వ్రాసిన ఉత్తరములోని కొన్ని అంశాలను నేను ఉటంకిస్తున్నాను, " పరలోక తండ్రీ, అధ్యక్షుడు థామస్ ఎస్. మాన్సన్ గారు తన భార్యను తిరిగి చూడబోతున్నందుకు మీకు వందనాలు. మా నూతన ప్రవక్త కొరకు మీకు వందనాలు. ఆయన ధైర్యంగా ఉండుటకు, క్రొత్త వాడినని భయపడకుండా ఉండునట్లు సహాయము చేయుము. ఆరోగ్యము, బలము కలిగి ఎదుగుటకు సహాయము చేయుము. ఆయన యాజకత్వము కలిగియున్నందువలన ఆయనకు శక్తి కలుగునట్లు సహాయము చేయుము.  మేము మంచిగా ఉండడానికి ఎప్పుడూ సహాయము చేయుము."

ఇటువంటి బిడ్డలను బట్టియు, మరియు తమ బిడ్డలను నీతిమంతులుగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకున్నతల్లిదండ్రులను బట్టియు, ప్రయాసమైన భారము మోయుచు కూడా మనస్ఫూర్తిగా దేవుని సేవ చేయు ప్రతీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సభ్యుల కొరకు నేను దేవునికి వందనాలు చెల్లిస్తున్నాను. మరో మాటలో, మీలో ప్రతి ఒక్కరి కొరకు నా మిక్కిలి వినయపూర్వకమైన కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

ప్రభువు అధికారంలో ఉన్నాడు

మనము కలిసి ముందుకు సాగిపోవుచుండగా, ఆ

ప్రభువు ఏ విధముగా తన సంఘమును రాజరికంతో పరిపాలించు చున్నాడో మననము చేసుకోవలసినదిగా నేను మిమ్మల్ని ఆహ్వానించుచున్నాను. సంఘములో ఒక అధ్యక్షుడు చనిపోయినప్పుడు, ఆ హోదాలో సేవ చేయుటకు తరువాత ఎవరు పిలువబడతారు అనే విషయంలో ఎటువంటి మర్మము లేదు. ఏవిధమైన ఎన్నికల యంత్రాంగము గాని, ప్రచారము గాని లేదు. కానీ, ఆ ప్రభువు చేతనే నియమించబడిన దైవిక పారంపరాచార ప్రణాళిక ప్రశాంతముగా అమలు చేయబడినది.

అపోస్తలుని యొక్క సేవలో ప్రతీరోజు నేర్చుకొను దినమైయుండి, భవిష్యత్తులో ఎక్కువ బాధ్యతల కొరకు సిద్ధపడే దినమైయుంటుంది. అపోస్తలుడు చిన్న స్థాయి పదవి నుండి ఉన్నతస్థాయి పదవికి వరుసలో ఎదగడానికి దశాబ్దాల కాలం పడుతుంది. ఆ సమయంలో, అతనికి సంఘ కార్యకలాపాల విభాగము యందు ప్రత్యక్షమైన అనుభవం లభిస్తుంది. అతడు విధి నిర్వహణలో భాగంగా భూగోళం చుట్టూ అనేకసార్లు చుట్టి రావడం వలన భూ జనులతో, వారి చరిత్రలు, వారి సంస్కృతులు, వారి భాషలతో మంచి పరిచయం కూడా ఏర్పడుతుంది. సంఘము యొక్క నాయకత్వంలో ఈ విధమైన పారంపర్యాచారము సాటిలేనిది. అటువంటిది మరొకటి ఉన్నట్లు నేనెరుగను. అది మనకు ఆశ్చర్యము కలిగించనవసరం లేదు, ఏలయనగా ఇది ఆ ప్రభువు సంఘము. మానవుల మాదిరిగా ఆయన కార్యములను చేయడు.

పన్నెండు మంది సమూహములో గత ఐదుగురు అధ్యక్షుల క్రింద నేను సేవ చేశాను. ప్రతి అధ్యక్షుడు బయల్పాటును పొందుట ఆ బయల్పాటుకు వారు స్పందించుట నేను గమనించాను. ఆ ప్రభువు ఇప్పుడు, ఎల్లప్పుడూ తన ప్రవక్తలకు ఉపదేశించుచు, ప్రేరేపించుచుం డును. ప్రభువు అధికారంలో ఉన్నాడు. ప్రపంచమంతటా ఆయన పరిశుద్ధ నామమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నియమించబడిన మేము, ఆయన చిత్తమును తెలుసుకొనుటకు మరియు దానిని అనుసరించుటకు వెదకుటను కొనసాగిస్తాము.

నిబంధన మార్గంలో నిలిచియుండుము

ఇంకను, మీరు నిబంధన మార్గంలో నిలిచియుండుము అని సంఘ సభ్యులు ప్రతి ఒక్కరికి నేను చెప్పుచున్నాను. రక్షకునితో నిబంధనలు చేసుకొని వాటిని పాటించుచు ఆయనను వెంబడించుటకు ప్రతీచోటా కట్టుబడియున్న పురుషులకు, స్త్రీలకు మరియు పిల్లలకు లభ్యమయ్యే ప్రతీ ఆత్మీయ దీవెన మరియు విశేషావకాశమును మీరు పొందుటకు ముఖద్వారములు తెరువబడును.

నూతన అధ్యక్షత్వముగా మేము, అంతమును మనస్సులో నుంచుకొని ఆరంభించ తలంచుచున్నాము. ఆ కారణము చేతనే, మేము ఈరోజు ఒక దేవాలయములో నుండి మీతో మాట్లాడుచున్నాము. మనమందరమూ పాటుపడుచున్న అంతము దేవాలయమునందు దైవశక్తిచేత అనుగ్రహింపబడవలెను, అనగా కుటుంబాలుగా బంధించబడి, దేవుడిచ్చే--నిత్యజీవమనే గొప్ప మహత్తర వరమును పొందుటకు అర్హత నిచ్చేటటువంటి దేవాలయ

నిబంధనలను విశ్వాసముతో నెరవేర్చవలెను. దేవాలయ విధులు, అక్కడ మీరు చేయు నిబంధనలు, మీ జీవితాలను, మీ వివాహము, కుటుంబము, ఇంకా మీలో అపవాది యొక్క ముట్టడులను ఎదుర్కొను శక్తిని పొందుటకును మూలాధారమై యున్నవి. దేవాలయములో మీరు చేయు ఆరాధన, మీ పూర్వీకుల కొరకు మీరు చేయు సేవ అధికమైన వ్యక్తిగత బయల్పాటు, మనశ్శాంతితో మిమ్మల్ని దీవించును మరియు నిబంధన మార్గములో నిలిచియుండుటకు మీ నిబద్ధతను బలపరచును.

ఇప్పుడు మీరు మార్గములోనుండి తప్పిపోయిన యెడల, దయచేసి తిరిగి రమ్మని నా హృదయములో సంపూర్ణ నిరీక్షణతో మిమ్ములను ఆహ్వానించనా. మీ భయములేవైనా, మీ సవాళ్లు ఏవైనా, ప్రభువు యొక్క ఈ సంఘములో మీకు ఒక స్థలము ఉన్నది. నిబంధన మార్గంలోనికి తిరిగి వచ్చుటకు ఇప్పుడు మీరు చేయు క్రియల ద్వారా మీరును మరియు పుట్టబోవు తరముల వారును ఆశీర్వదింపబడతారు. పరలోకమందున్న మన తండ్రి తన బిడ్డలను జ్ఞాపకముంచుకొనును మరియు మనలో ప్రతి ఒక్కరూ ఆయన గృహమునకు తిరిగి రావలెనని కోరుకొనును. మనలో ప్రతీఒక్కరు గృహమునకు తిరిగి వచ్చుటకు సహాయపడుట---యేసు క్రీస్తు యొక్క కడవరి దిన పరిశుద్ధుల సంఘము యొక్క ఘనమైన లక్ష్యము.

దశాబ్దాల తరబడి మిమ్మును కలుసుకొనుట వలన, మీతో కలిసి ఆరాధించుచు మీకు సేవ చేయుట వలన పెరిగిన ప్రేమను--- మీ కొరకు నాయొక్క లోతైన ప్రేమను వ్యక్తపరచుచున్నాను. ఈ ప్రపంచాన్ని యేసు క్రీస్తు యొక్క రెండవ రాకడకు సిద్ధపరచుటలో సహాయపడుచు ప్రతి దేశము, వంశము, భాష మరియు జనుల వద్దకు పోవుట మా దైవిక శాసనము. యేసు క్రీస్తు అధికారములో ఉన్నాడని ఎరిగి, ప్ర ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముతో దీనిని మేము చేస్తాము. ఇది ఆయన కార్యము మరియు ఆయన సంఘము. మేము ఆయన సేవకులము.

మన నిత్యుడైన తండ్రియగు దేవుని యందు మరియు ఆయన కుమారుడైన యేసు క్రీస్తు నందు, నా భక్తిశ్రద్ధలను ప్రకటించుచున్నాను. వారిని నేనెరుగుదును, వారిని నేను ప్రేమించుచున్నాను, మరియు శేషించిన నా యావత్తు శ్వాసతో వారికి—మరియు మీకు—సేవ చేస్తానని ప్రతిజ్ఞ చేయుచున్నాను. యేసు క్రీస్తు యొక్క పరిశుద్ధ నామములో, ఆమేన్.

© 2018 అన్ని హక్కులు కలిగియున్నది. అ.సం.రా. లో ముద్రించబడినది. ఆంగ్ల ఆమోదము: 6/17. అనువాద ఆమోదము:6/17. యొక్క అనువాదము